క్లుప్తంగా

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 60 ఎంఎల్‌డీ నీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద మరమ్మతులు కొనసాగుతున్నందున బుధ, గురు వారాల్లో అండర్ రైల్వేగేట్ ప్రాంతంతోపాటు పలు విలీన గ్రామాల్లో తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్, మడికొండ, కడిపికొండ, భట్టుపల్లి, కరీమాబాద్, పెరుకవాడ, శివనగర్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట, ఖిలా వరంగల్, మామునూరు, నాయుడు పెట్రోల్ పంపు ప్రాంతం, తిమ్మాపూర్, నక్కలపల్లి, రాంగోపాల్‌పూర్, సింగారం, దూపకుంట, వసంతాపూర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేటలోని ప్రశాంత్‌నగర్, డాక్టర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, బాపూజీనగర్, వెస్ట్ సిటీ, బూడిద గడ్డ, ఎస్ఎస్.రెడ్డి నగర్, డీజిల్ కాలనీ, శాంతినగర్, జూబ్లీ మార్కెట్, సెయింట్ ఆన్స్ స్కూల్, ఇంపీరియల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమకొండలోని లోటస్ కాలనీ, మైత్రి వనం, విల్లాస్, ప్రకాశ్‌రెడ్డి పేట, జులైవాడ, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ లోకల్ కోర్టు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 18న హనుమకొండ గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎస్వీ.వేణుగోపాల చారి తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు విన్నవించుకోవచ్చని, ఫిర్యాదులు అందించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సంకటహర చతుర్థి పూజలను బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడాకారుడికి అభినందన



ఖిలా వరంగల్: ఇటీవల వరంగల్ జిల్లాలోని మొగిలిచర్ల క్రికెట్ క్రీడా మైదానంలో టీ టెన్ తెలంగాణ టెన్నిస్, క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -15 బాలుర విభాగంలో జరిగిన జిల్లా క్రికెట్ పోటీల్లో తాళ్ల పద్మావతి స్కూల్ విద్యార్థి సంతోష్‌కుమార్ పాల్గొని ప్రతిభ కనబరిచాడని పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఈమేరకు వరంగల్ హంటర్ రోడ్డులోని పాఠశాలలో సంతోష్ కుమార్‌ను డైరెక్టర్ వరుణ్, వైష్ణవి, ప్రిన్సిపాల్ తగరం స్వర్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం



హన్మకొండ: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని పోలెపాక విరి ఎంపికైంది. జమ్మూకశ్మీర్‌లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు విరి ప్రాతినిధ్యం వహించనుంది. ఈమేరకు పోలెపాక విరిని స్కూల్ ప్రిన్సిపాల్ గోపు మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునీత రెడ్డి, పీఈటీ సాగర్, కోచ్ వినయ్ అభినందించారు.

ఫాతిమా బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



కాజీపేట రూరల్: ఫాతిమా బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డి.మొగిలికి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూఢిల్లీలోని ఎన్ఐఈపీఏలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శంకర్ పర్యవేక్షణలో అండర్ స్టాండింగ్ ఎమోషన్స్ ఇన్ టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్‌పై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మొగిలికి డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల కరస్పాండెంట్, ఫాదర్ జయపాల్, అధ్యాపకులు అభినందించారు.

భవనం కూల్చివేయడం సరికాదు

వరంగల్: ఆజంజాహి మిల్లు కూల్చివేయడం సరైనది కాదని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీటీయూ నాయకులు ఇనుముల శ్రీనివాస్, గంగుల దయాకర్, నర్రప్రతాప్ అన్నారు. కార్మికుల కార్యాలయాన్ని కూల్చివేసిన సంఘటనపై ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఏజీ మిల్ గ్రౌండ్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆకస్మాత్తుగా కూల్చివేయడాన్ని అన్ని కార్మిక సంఘాలు ఖండిస్తున్నాయని అన్నారు.

జనావాసాల్లో ముళ్ల చెట్లు

- ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- విష పురుగుల సంచారంతో భయాందోళనలో స్థానికులు

మడికొండ: గ్రేటర్ వరంగల్‌లోని 46వ డివిజన్‌లోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దాంతో విష పురుగుల బెడద పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల యజమానులు వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో పందులు, కుక్కలు, విషసర్పాలకు నిలయంగా మారాయి. మడికొండ, రాంపూర్, ప్రాంతాల్లో చాలా మంది స్థలాలను కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. దాంతో ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో డంపింగ్ యార్డ్‌గా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



46వ డివిజన్‌లో అడవిని తలపిస్తున్న తుమ్మచెట్లు



అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లో ముళ్లచెట్లు ఏపుగా పెరిగి పాములు సంచరిస్తున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. పందులు, విషసర్పాల బెడద అధికంగా ఉంది.

– మూల లక్ష్మి, మడికొండ

భయమేస్తోంది..



ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో వాటిలో విషసర్పాలు, పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. తిరుగుతూ ఇళ్లల్లోకి వస్తున్నాయి. దాంతో బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. అపరిశుభ్రం కారణంగా వృద్ధులు, పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

– శ్రీనివాస్, ఎస్సీ కాలనీ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బకాయిలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నిడిగొండ రజిత డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండో రోజు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేస్తూ వంటావార్పుకు సిద్ధమైన కార్మికులను సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, నిడిగొండ రజిత మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టైన కార్మికులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, నాయకులు శాంత, రాధ, శ్రీలత, మంజుల, కవిత, కొమురమ్మ, ప్రేమలత, కార్మికులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ సంబురాలు



కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్డులోని గెత్సెమనే చర్చిలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ముఖ్యఅతిథిగా కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాష్ పాల్గొని ఏసుక్రీస్తు జన్మదినం ప్రాముఖ్యతను వివరించారు. చర్చి సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును ఆరాధించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాషువా, చర్చి సంఘపెద్దలు, చర్చి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు, మహిళలు

వరంగల్: మహిళల హక్కులు, చట్టాలు, సఖి సెంటర్ సేవలపై మహిళా సంఘాల సభ్యులకు వరంగల్ లేబర్ కాలనీలో వరంగల్ సఖి సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు, పిల్లలకు అందించే సేవలను వివరిస్తూ మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను ఏర్పాటు చేశాయని వివరించారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్ పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను సఖి అందిస్తోందని వివరించారు. ఆపద సమయంలో 181 నంబర్‌కు కాల్‌చేసి తక్షణ రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం సఖి సేవల పోస్టర్లను ఆవిష్కరించారు. సఖి కేసు వర్కర్ స్వప్న, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేతిపంపు ఏర్పాటు



పంపును ప్రారంభిస్తున్న వైద్యులు, సంస్థ ప్రతినిధులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోరు వేయించి చేతిపంపు ఏర్పాటు చేశారు. ఈ చేతిపంపును ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ బాలరాజ్, ఆస్పత్రి ఆర్ఎంఓలు డాక్టర్ దీపక్ రెడ్డి, డాక్టర్ రోషన్, బాలవికాస సంస్థ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీశ్, ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కెనడా దేశానికి చెందిన మార్సెల్ ఎటు లూస్ ఆర్థిక సాయం, యూఎఫ్‌సీసీ ఫౌండేషన్ సౌజన్యంతో సుమారు రూ.80 వేల ఖర్చుతో బోరు వేయించినట్లు బాలవికాస సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రశాంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ ఎక్స్‌పో



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో నగరవాసులను ఆకట్టుకుంటోంది. దేశం నలుమూలల నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల వస్త్రాలు మహిళల మనస్సును దోచేస్తున్నాయి. సహజ నారపట్టు, బనారస్, కాంజీపురం, బిహార్ టస్సర్, పశ్చిమ బెంగాల్ బైల బలుచారి, ఢకాయి, జమర్థాని మట్కా సిల్క్, ఛత్తీస్‌గఢ్ కోస, గుజరాత్ పటోల, బంధిని, టస్సార్, కాంతా, హ్యాండ్ ప్రింటెడ్, ధర్మవరం, చందేరి, ఎరి, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, కలంకారి చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి అనేక సర్టిఫైడ్ న్యూస్ సిల్క్ ఉత్పత్తుల తయారీదారులందరు ఒకేచోట వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన, అమ్మకాలు ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా కాశిబుగ్గ యూనిట్ ఆధ్వర్యంలో 42వ అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవాన్ని కాశిబుగ్గలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. యూనిట్ అధ్యక్షుడు, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అధ్యక్షత వహించగా ఆరుగురు సీనియర్ పెన్షనర్లు రమణయ్య, సుజాత, దీనబంధు, ఇక్బాల్ అహ్మద్, అఫ్జల్‌ఖాన్, సూర్యప్రకాశ్‌ను సన్మానించారు. రాష్ట్ర సంఘ సలహాదారు నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరాస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం, పెన్షనర్లు రఘుపతి, మదార్‌సాహెబ్, మధుసూదన్‌రావు, రత్నం, కుమారస్వామి, కృష్ణమూర్తి, రహమాన్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

కాజీపేట: మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేల కనీసం వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సంఘం సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అరిక్ల వెంకన్న, సుశీల్, రవీందర్, అనుదీప్, మంద అనిల్, సుధాకర్, భాస్కర్, ఎర్ర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలపై అవగాహన అవసరం

- కార్డియాలజిస్ట్ రామక శ్రీనివాస్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

కేయూ క్యాంపస్: హృద్రోగ సమస్యలపై విశ్రాంత ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామక శ్రీనివాస్ సూచించారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం అధ్యక్షతన కేయూలోని సెనెట్‌హాల్‌లో విశ్రాంత బోధన ఉద్యోగుల పెన్షనర్ల దినోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గుండె సంబంధిత వ్యాధులపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్ పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, కుర్తా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, మహబూబాబాద్ మాజీ ఎంపీ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సీతారాంనాయక్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రిటైర్డ్ ఉద్యోగుల సేవలు అభినందనీయం



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ: కనీస వసతులు లేనికాలంలో మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ సౌకర్య కల్పనలో అప్పటి ఉద్యోగులు అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ కె.సత్యనారాయణ కొనియాడారు. వడ్డెపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో ఎన్పీడీసీఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న రిటైర్డ్ ఉద్యోగులు బ్రహ్మాచారి, బంగారు మల్లయ్య, గడ్డం సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి సహా 30 మందిని సన్మానించారు. ఎన్పీడీసీఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొగులయ్య, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నూతన మెనూను పటిష్టంగా అమలు చేయాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన కొత్త మెనూను పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా టీఎస్జీఓఎస్ జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా టీఎస్జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం కలెక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు గోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్‌సుందర్, రాము నాయక్, హాస్టల్ ఫోరం అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి శంకరయ్య, జిల్లా నేతలు రజిత, దుర్గయ్య, భరత్, ప్రణయ్, పృథ్వీ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

విద్యారణ్యపురి: హనుమకొండలోని వడ్డేపల్లిలోని దివ్యాంగుడు కాటిమల్ల అయిలయ్యకు విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కుందావఝల కృష్ణమూర్తి సహకారంతో మంగళవారం అందజేసినట్లు విద్యాఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ తెలిపారు. అయిలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికాగా, ఆయన మూడు చోట్ల శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో బాధ్యులు మౌనిక, పాలసాని వెంకన్న, ఇస్లావత్ చందు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లా ఎల్గూర్ రంగంపేట వద్ద రైలు ప్రమాదంలో మృతి చెందిన రమేష్ కుటుంబ సభ్యులకు రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంజీఎంకు సమీపంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు సమ్మయ్య, యుగేందర్, సుధాకర్, రాజేష్, ముత్యాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు చీరల పంపిణీ

దేశాయిపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకొని పేద వితంతువులకు 13వ డివిజన్ దేశాయిపేట్‌లోని యేసుపాదం గృహంలో స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి, కల్వరి బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ.జోయల్ కరుణాకర్ విక్టర్ మంగళవారం చీరలు పంపిణీ చేశారు. జన్ను అనిల్ కుమార్, కొత్తూరి టైసన్, జాజి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేత

హసన్‌పర్తి: సీఎం కప్ జోన్‌స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు టీషర్ట్‌లను అటికం రాజమ్మ – ఎల్లాగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, హసన్‌పర్తి కబడ్డీ అసోసియేషన్ జోన్ అధ్యక్షుడు అటికం రవీందర్ మాట్లాడుతూ జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కబడ్డీ క్రీడాకారులు చెట్లపల్లి లింగమూర్తి, నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రమేష్, స్థానిక నాయకులు విక్టర్‌బాబు, దేవరాజ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ఎంజీఎం: ఎంజీఎం, కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వృద్ధులకు మెరుగైన వైద్య సేవలందించాలని గోపాలపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ మురళిని మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, బాధ్యులు గోకారపు రాజేందర్, గంటి సాంబయ్య, తాడూరు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు జీవనోపాధి కల్పించాలి

హన్మకొండ అర్బన్: పరకాల వ్యవసాయ మార్కెట్‌లో పీడీఎస్ బియ్యం గోదాములను ఖాళీ చేయడంతో ఉపాధి కోల్పోయిన హమాలీ కార్మికులకు ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా బాధ్యులు లంక దాసరి అశోక్, కె.శంకర్, యాదగిరి, రాజయ్య, మోరే రవి, కుమారస్వామి, పోచయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని పలివేల్పుల ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో సమస్యలు తెలుసుకునేందుకు ఎస్ఎఫ్ఐ బాధ్యులు లోపలికి వెళ్తుండగా ప్రిన్సిపాల్ అనుమతించలేదని వారు గురుకుల కళాశాల వద్ద గేట్‌వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బాధ్యులు సాయికిరణ్, అజయ్, అభిషేక్, సందీప్, మల్లేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పోలింగ్ బూత్ కమిటీలు కీలకం

హన్మకొండ: పార్టీలో పోలింగ్ బూత్ కమిటీలే కీలకమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్‌లోని 112, 113, 118వ పోలింగ్ బూత్ అధ్యక్షులను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వద్దిరాజు వాణి, రడం వాణి, పిట్టల ధనలక్ష్మిని రావు పద్మ సన్మానించారు. కొలను సంతోష్‌రెడ్డి, దొంతి దేవేందర్ రెడ్డి, రావు అమరేందర్ రెడ్డి, నర్మెట్ట శ్రీనివాస్, గాదె రాంబాబు, హరీష్, నిఖిల్, శోభన్, మధు, సంపత్ రెడ్డి, ధనలక్ష్మి, వాణి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంకు మూకుమ్మడి రాజీనామా

ఖిలా వరంగల్: సీపీఎం ఏరియా కార్యదర్శి మాలోతు సాగర్ బహిష్కరణకు గురయ్యారు. ఈమేరకు జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య ప్రకటించిన నేపథ్యంలో పార్టీ నిర్ణయాన్ని నిరసిస్తూ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన 15మంది పార్టీ ఏరియా కమిటీ సభ్యులు, 17 మంది శాఖ కార్యదర్శులు మూకుమ్మడిగా మంగళవారం రాజీనామా చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తాటికాయల రత్నం తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

న్యూశాయంపేట: ప్రభుత్వం అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో హనుమకొండ మండల కౌన్సిల్ సమావేశం నర్సయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో నాయకులు ఎల్లేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, రవి, సుదర్శన్, ప్రభాకర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

టెక్సాస్ యూనివర్సిటీతో వాగ్దేవి ఒప్పందం

మామునూరు: వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలతో అమెరికాలోని టెక్సాస్ (ఏఎం) యూనివర్సిటీ శాన్ ఆంటానియోతో పరిశోధనాత్మక విద్యపై మంగళవారం అవగాహన ఒప్పందం జరిగిందని వాగ్దేవి గ్రూప్ సెక్రటరీ దేవేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ సయ్యద్ ముస్తాన్ అహ్మద్, యూనివర్సిటీ డీన్ డాక్టర్ టింగ్‌లీ, డాక్టర్ విజయ్, బర్కత్ జీవాని, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

హసన్‌పర్తి: లగచర్ల రైతులకు బేడీలు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, నాయకులు రాజునాయక్, బోడ యుగంధర్, కర్ణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, ప్రభాకర్, చిన్నస్వామి, రాజారెడ్డి, సాంబయ్య, మురళి పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

ఖిలా వరంగల్: తూర్పు కోటలో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. చేతికి అందిన కుమారుడు దూరం కావడం, కుటుంబ కలహాల కారణంగా మనోవేదనతో మానసిక స్థితి కోల్పోయిన గన్నారపు దాసు.. సెల్ టవర్ ఎక్కి దూకుతా అంటూ కుటుంబ సభ్యులను బెదిరించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని కిందికి దింపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోరాట యోధుడికి నివాళి

న్యూశాయంపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్యానాయక్ సోమవారం మృతిచెందారు. ఈమేరకు జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధర్మాపురానికి వెళ్లి మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వాసుదేవరెడ్డి, చక్రపాణి, వెంకట్, వీరన్న తదితరులు ఉన్నారు.

టీఆర్పీఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మేడారపు సుధాకర్



కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టీఆర్పీఎస్) రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ వెల్లడించారు.

డీబీఎఫ్ మండల అధ్యక్షురాలిగా రాధ



హసన్‌పర్తి: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) మండల అధ్యక్షురాలిగా హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన బౌతు రాధ నియమితులయ్యారు. ఈమేరకు డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్పన ప్రకటించారు.

సీతారామచంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, ఉమామహేశ్వరి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడి పూజ

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని శ్రీద్వారక అపార్ట్‌మెంట్‌లో సత్యం గ్రూప్ చైర్మన్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో గురుస్వామి పోల ఉమామహేశ్వర్ నేతృత్వంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను మంగళవారం నిర్వహించారు. 18 మెట్ల మీద ప్రత్యేక పీఠంపై అయ్యప్ప స్వామి, మహాలక్ష్మి, వినాయకుడి విగ్రహాలను పెట్టి శాస్త్రోక్తంగా పడిపూజ చేశారు. పూజా కార్యక్రమంలో కర్నె రవీందర్, బోరిగం నాగరాజు, కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి విభూదితో అభిషేకం

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి నదీ జలంతో పాటు విభూదితో మంగళవారం సహస్ర అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ప్రజాపాలన పేరుతో అక్రమ అరెస్టులు

కేయూ క్యాంపస్: ప్రజాపాలన పేరుతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని కేయూ విద్యార్థి నాయకుడు మర్రి మహేష్ ఆరోపించారు. ఓ విద్యార్థి సంఘం మంగళవారం చలో అసెంబ్లీ పిలుపు ఇవ్వడంతో సోమవారం రాత్రి విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారని వాపోయారు.

భూ ఆక్రమణలపై విచారణ

వరంగల్: 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో భూ ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో తహసీల్దార్ ఇక్బాల్ స్పందించారు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. భూ ఆక్రమణలపై విచారణ తహసీల్దార్ చేపట్టారు. ఖాళీ స్థలాలు గుర్తించి ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేయించారు.